# అద్దెలేని కాపురం

**అజీజ్**




హైదరాబాదు వంటి మహా నగరంలో, అదీ నగరం నడిబొడ్డున, సకల సౌకర్యాలూ గల అధునాతన ఇల్లు అక్షరాలా నాకు అద్దె లేకుండా దొరికిందంటే, వీడెవడో పిచ్చాసుపత్రి నించి డిశ్చార్జి అయిన బాపతనుకునేరు సుమండీ!

ముందు ఉద్యోగమూ, తరవాత కళ్యాణ యోగమూ కాస్త కుడి ఎడంగా వెంటవెంటనే ప్రాప్తించాయి నాకు. ఐతే, కొత్త కాపురాని కనుకూలమైన కొంప మాత్రం అంత సులభంగా దొరికి చావ లేదా నగరంలో. అందుకే నా చరణ దాసిని చిత్తూరులో వదలి, కల్తీలేని బ్రహ్మచర్యం పాటిస్తూ, హిమయత్ నగర్‌లో చిన్నగది అద్దెకు తీసుకుని, హోటల్ మెతుకులు గతుకుతూ కాల క్షేపం చెయ్యసాగాను.

అప్పుడే, మా ఆఫీసులోని ఓ యు.డి.సి గారితో నాకు మంచి సంబంధ బాంధవ్యాలు పెంపొందాయి. ఆయన పేరు కర్నాటి నాగభూషణం! ఇంటి పేరు చూసి ఆయన్ని ఏ కర్నాటక బాపతో అనుకునేరు సుమండోయ్. పద హారణాల పచ్చి ఆంధ్రుడే! అందునా, మా చిత్తూరు వాస్తవ్యుడే!!

ఊరుకాని ఊళ్ళో స్వప్రాంతీయులు తటస్థపడితే, అందునా ఇద్దరి ఉద్యోగాలూ ఒకే ఆఫీసులో తగలడితే, సాంగత్యం పెంపొందటం సహజమే కదా? ఎటొచ్చీ ఆయనగారు చాలాకాలం క్రితమే ఇక్కడ తిష్టవేసి, అమ్మాయ్యాల రూపంలో రెండు చేతులా ఆర్జించి, సిమెంటూ గట్రా చవగ్గా ఉన్న రోజుల్లో నిక్షేపంగా ఓ ఇలు లేపేశాడిక్కడ!

సాయంత్రాలు తోచక తరచూ వాళ్ళింటి కెళ్ళేవాణ్ణి. అప్యాయంగా నన్ను ఆయన 'తమ్ముడూ' అని పిలిచే వాడు. ఆ వరసకు తగ్గట్టు ఆయన భార్య కూడా 'మరిదిగారూ' అని నన్ను సంబో ధించడం మహా ఇబ్బందిగా ఉండేది నాకు. కారణం, అంత వయసులోనూ ఆమె పసిమిఛాయతో పనసపండులా అందంగా ఆకర్షణీయంగా ఉండటమే!

వారి పిల్లలు కూడా నన్ను ముద్దుగా 'అంకుల్' అని సంబోధించేవారు. అందుకే వాళ్ళింటి కెళ్ళినప్పుడల్లా ఆ సదరు పిల్లలకోసం బిస్కట్లో, చాక్లెట్లో, అరటిపళ్ళో తీసికెళ్ళడం మరిచేవాణ్ణి కాదు. పిల్లలంటే మరీ చిన్న పిల్లలు కారు. పెద్దాడికి పదిహేడు, అమ్మాయికి పదహారూ, మరో అమ్మాయికి పదిహేనూ మిగతా ఇద్దరూ చిరుప్రాయులు.

అలా మా అనుబంధం మూడు పువ్వులూ, ఆరు కాయల్లా సాగి పోతుండగా ఉన్నట్టుండి ఓ పిడుగులాంటి వార్త నాతోబాటు ఆ కుటుంబాన్ని కూడా కుదిపేసింది.

నాగభూషణం అమ్మ్యామ్మ్యాల భాగోతం కిట్టనివాళ్ళు కొందరు గత ఆరేళ్ళ నించీ ఆయనమీద ఎడాపెడా పై అధికార్లకు ఫిర్యాదులు పంపుతున్నారట.

ఆ తతంగం చివరికి ఈ పిడుగులాంటి వార్త రూపంలో ఆయన నెత్తిన పడింది! పాపం ఆయన్ని రాష్ట్రం నడిబొడ్డునించి ఏకంగా మహారాష్ట్ర సరిహద్దు అటవీ ప్రాంతమైన ఆదిలాబాదుకు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆర్డర్స్ అందగానే నెలరోజులు సెలవుపెట్టి, ఆ బదిలీని రద్దుచేసుకోడానికి శాయశక్తులా ప్రయత్నించాడాయన. కానీ, ఫలితం దక్కలేదు!

ఓరోజు మామూలుగా వాళ్ళను పరామర్శించి వద్దామని వెళితే, అప్పటికే తట్టాతప్పేళా సర్దుకుని, ప్రయాణానికి సమాయత్తమవుతున్నా రందరూ.

నన్ను చూడగానే వదినగారు పైటతో కళ్ళొత్తుకుని, "ముదనష్టపోళ్ళు పచ్చగా ఉంటే చూళ్ళేక కళ్ళల్లో నిప్పులోసుకుని మాకీ గతిపట్టించారు. సరే, ఏం చేస్తాం? మీ అన్నగార్ని వదిలి మేమూ, మమ్మల్ని వదిలి ఆయనా ఉండలేం కదా? అందుకే, అందరం వెళ్ళిపోతున్నాం! సమయానికి వచ్చావు. కుర్రాణ్ణి పంపి నేనే నిన్ను పిలిపించా లనుకుంటున్నాను." అంది.

"చెప్పండి వదినగారూ! నావల్ల ఏ సహాయం కావలసినా మొహమాట పడకండి," అన్నాను సానుభూతిగా.

"మీ అన్నగారీ ఇంటిని ఎవరికో అద్దెకివ్వాలనుకున్నారు. నిక్షేపంలాంటి నువ్వుండగా ఎవరికో ముక్కూమొహం తెలియని వాళ్ళకివ్వడం దేనికని నేనే వారించాను. ఎంతైనా పరాయివాళ్ళు పరాయివాళ్ళే కదా, సొంత ఇంటిలా చూసుకుంటారా? పైగా, మన అవసరానికి వాళ్ళను ఖాళీచేయించాలంటే బ్రహ్మదేముడు దిగిరావాలి. అదే మనవాళ్ళైతే ఎలాటి పేచీ ఉండదు. అందుకే, నీ భార్యను పిల్చుకొచ్చి, నిక్షేపంగా ఈ ఇంట్లో కాపరం పెట్టు!" అన్న ఆమె మాటలు విని ఆనందంతో ఊపిరాడటం లేదు నాకు.

"అలాగే వదినగారూ! ఇంటి గురించి మీరేం దిగులుపెట్టుకోకండి. మా కళ్ళల్లో పెట్టుకు మరీ చూసుకుంటాం! అద్దె ఎంతో చెబితే, ప్రతినెలా ఠంచనుగా పంపిస్తుంటాను."

"ఎంతమాటెంతమాట! మనవాళ్ళ దగ్గరెవరైనా అద్దె పుచ్చుకుంటారా? ఆయన నిన్ను స్వంత తమ్ముడిలా భావిస్తారు. నేనూ మరిదిగా భావిస్తాను. అలాటప్పుడు నీ దగ్గర అద్దెపుచ్చుకోడానికి మా మనసొప్పుతుందా? ఆఁ, మీమీద రవ్వంత భారం మాత్రం వేసిపోతాము.

"పెద్దాడు ఆనంద్ ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉన్నాడు కదా? మాతో బాటు వాణ్ణి తీసికెళ్తే వాడి చదువు పాడవుతుంది. అందుకే, ఇక్కడే వదిలిపోవా లనుకుంటున్నాము. వాడి తిండితిప్పలకు సరిపడే వెచ్చాలన్నీ స్టోరుగదిలో ఉంచాం! మీతో బాటు వాడికింత వండి పడేస్తే చాలా మేలుచేసినవాళ్ళవుతారు." అన్న ఆమె మాటలు విని, సంతోషం పట్టలేక అక్కడే భరతనాట్యం చెయ్యాలనిపించింది నాకు. ఐతే, ఆ నాట్యంలో అదివరకు ఓనమాలు కూడా తెలియవు గనక అతి కష్టంమీద తమాయించుకున్నాను.

నగరం నడిబొడ్డున, సకల సౌకర్యాలూ గల ఇంత అందమైన ఇల్లు అంత సులభంగా దొరకడం మాటలా? అదీ అద్దెలేకుండా!

"ఎంతమాట వదినగారూ! మీ అబ్బాయి మా అబ్బాయి కాడా? ఇంట్లో ఎలాగూ మా ఇద్దరి వంట జరుగుతున్నప్పుడు అందులో ఆనంద్‌ని చేర్చుకోడం పెద్ద కష్టమా? మీరు నిశ్చింతగా ఉండండి" అన్నాను.


ఆ మర్నాడే ఆనంద్‌ను ఇక్కడ వదిలి అందరూ వెళ్ళిపోయారు. నేనూ రెండ్రోజులు సెలవు పడేసి, ఆదరాబాదరా చిత్తూరు వెళ్ళి, నా భార్యామణిని తీసుకొచ్చాను. ఇల్లు చూడగానే ఆమె కూడా తెగ సంబరపడిపోయింది.

ఐతే, ప్రయాణపు హడావుడిలో వదినగారు వాళ్ళబ్బాయికి వెచ్చాలగది తాళం చెవి ఇవ్వడం మర్చిపోయిందని తెలిశాక, మా సంబరం కాస్తా సంబడం అయి, అంతవరకూ గుమ్మడికాయల్లా మిసమిసలాడిన మా మొహాలు నిమ్మకాయ సైజులోకి మారాయి!

గణితశాస్త్రంలో ఆరితేరిన మా ఆవిడ వెంటనే ఓ కాగితం, కలం అందుకుని లెక్కగట్టి ఆ సమస్యకు పరిష్కారం తేల్చేసింది. ధరలు మండిపోయే ఈ రోజుల్లో ఆ అబ్బాయి భోజనం ఖర్చు ఎంతలేదన్నా వంద రూపాయలు అదనంగా మామీద పడుతుంది. ఆ వంద రూపాయలు ఇంటిఅద్దె చెల్లిస్తున్నామనుకుని సరిపుచ్చుకుంటే సరి, అనుకున్నాం!

అలా ఓ నెలరోజులు నిశ్చింతగా దొర్లిపోయాయో లేదో, ఆనంద్ చెల్లాయిలు అంటే, వదినగారి ఇద్దరు పుత్రికారత్నాలూ ఊడిపడ్డారు ఆదిలాబాదునించి. వనజా, వసంతా అనే ఆ ఇద్దరమ్మాయిలూ, గత మూడేళ్ళనించీ పదో తరగతిలో పల్టీలుకొడుతూ, ఇహ గట్టెక్కే ఆశలుగంటి, ప్రైవేటుగానైనా పరీక్ష కట్టి ఒడ్డు చేరుకుందామని దాపురించారట!

ఐతే, ఈసారి కూడా వదినగారు వాళ్ళకు వెచ్చాలగది తాళంచెవి ఇవ్వడం మర్చిపోడంతో మా ఆవిడ మళ్ళీ కాగితం, కలం అందుకుని అంకెలగారడీ ప్రారంభించింది. ఈసారి మా అదనపు ఖర్చు పెద్ద సంఖ్యనే సూచిస్తుందని నాకు తెలుసు. అందుకే నిశ్శబ్దంగా బైటికి జారుకుని, రాత్రి చాలా పొద్దుపోయాక తిరిగివచ్చాను. ఐనా, తెల్లారేవరకూ



పక్కలో ఆమె సణుగుడూ, నిట్టూర్పులూ వినిపిస్తూనే ఉన్నాయి।

ఆ మర్నాటి నించీ ప్రారంభమయ్యాయి మా ఆవిడ కష్టాలు. ఆ అమ్మాయిలిద్దరికీ వంటచెయ్యడం అటుంచి, కనీసం ఉల్లిగడ్డలు తరగడం కూడా చేతకాదుట। కారణం, వాళ్ళమ్మ అంటే, నా వదినగారు— అత్తారింటికెళ్ళాక ఆడపిల్లలెలాగూ వంటింటి కుందేళ్ళు కాక మానరు కదా, కనీసం పుట్టింటనైనా హాయిగా బ్రతకనిద్దామనే సదుద్దేశంతో వంటింట్లో అడుగుపెట్టనిచ్చేది కాదుట।

ఆవిడ ఆ సిద్ధాంతం నా భార్యపాలిటి శిక్షగా పరిణమించిందిప్పుడు. పొద్దస్తమానం వంట పరిధిలోనే పొగమధ్య జిడ్డోడుతూ కాలక్షేపం చేస్తోంది. ఆ ఇద్దరు ముద్దుగుమ్మలు రాకముందు, సాయంత్రాలు కనీసం ఏ సినిమాకో షికారుకో వెళ్ళేవాళ్ళం। ఇప్పుడా సరదాలన్నీ మాకు కలలకే పరిమితమయ్యాయి.

ఆ అమ్మాయిలిద్దరూ డ్రాయింగ్ రూంలో తీరిగ్గా బెస్టుబుక్కు ముందేసుకూర్చుని సినిమా కబుర్లు చెప్పుకుంటోంటే, మాఆవిడవంటింట్లో ఐదుమందికి రెండుపూటలా వంటవార్పులలో సతమతమాతోంది.

వీళ్ళ సంగతిలా ఉంటే, ఆ అబ్బాయి ఆనంద్ కూడా ఏం తీసిపోలేదు. తలిదండ్రుల ప్రాపకంలో ఉన్నప్పుడు వదినగారు అతనిమీద అనేక ఆంక్షలు విధించి కఠినమైన కట్టడితో ఉంచేది గనక, వారు వెళ్ళిపోగానే వీడికి స్వేచ్ఛావిహంగాలు పుట్టుకొచ్చాయి.

రాత్రి పన్నెండుగంటలముందు ఇల్లు చేరేవాడు కాదు. ఆ కారణంగా నా భార్య నాకు బదులు ఆయనగారి రాకకోసం కళ్ళలో వత్తులు వేసుకుని నిరీక్షిస్తూ ఆయనగారి భోజనాలయ్యాకే పక్కమీద నడుం వాల్చేది. అంతవరకే అయితే బావుండు, అడపాదడపా ఆ పెద్దమనిషి తన మిత్రబృందాన్ని కూడా భోజనాలకి ఆహ్వానించడం ప్రారంభించాడు.

ఈ లంపటం చాలదన్నట్టు అప్పుడప్పుడూ తమ ముద్దుల సంతానాన్ని చూసిపోవడానికి ఆదిలాబాదునించి అన్నగారూ, వదినగారూ మిగతా పటాలంతో సహా వచ్చిపోసాగారు. వచ్చిన ప్రతిసారీ వదినగారు ఆ వెచ్చాలగది తాళంచెవి తేవడం మర్చిపోయేవారు।

ఆవిడ సంగతలా ఉంటే, భోజన

ప్రియుడైన మా అన్నగారుఅక్కడభార్య చేతివంట తినీతినీ మొహంమొత్తిందని, ఇక్కడ మరదలి చేతివంట రుచిచూడ్డానికి మొహంవాచిపోయి, మొహమాటం లేకుండా ఫలానా ఫలానా వంటకాలు చేసిపెట్టమని మరీ పురమాయించేవారు. ఆ విధంగా మా ఆవిడ ఐదుగురికి బదులు తొమ్మిదిమంది వంటతో తంటాలు పడసాగింది!

మృష్టాన్నం సుష్టుగామేసి, బ్రేవ్‌మని త్రేమస్తూ,నాభార్యపాకశాస్త్రనైపుణ్యాన్ని తెగపొగిడేవారు అన్నగారూ, వదినగారూ! పోతూ, పోతూ తమ పిల్లల ఆరోగ్యం ఇప్పుడు చాలా బాగుందనీ, తమ ప్రాపకంలో కూడా ఇంత ఆరోగ్యంగా ఉండేవారు కాదనీ, ఓ ఉచిత సర్టిఫికేట్‌కూడా ఇచ్చిపోయేవారు.

"తేరగా వచ్చింది తింటే, పీనుగలు కూడా ఏనుగులవుతాయి మరి!" అంటూ సణుక్కునే నా భార్యని అతికష్టంమీద శాంతపరిచేవాణ్ణి.

ఓ రోజు నేను ఆఫీసునించి వచ్చి చూస్తే, ముక్కూమొహం తెలీని ఐదారుగురు పిల్లలు ఇంట్లో కుర్చీలమీద సర్కస్‌ఫీట్లు చేస్తూ, అలంకరణ సామగ్రి పీకి పచ్చడిచేస్తూ కనిపించారు.

వంటగదిలోకి దూసుకెళ్ళి, "ఆ కోతిమేళం ఎవరిదీ?" అడిగాను ఖంగారుగా కాగితం, కలం పట్టుకుని మళ్ళీ ఏవో లెక్కల్లో మునిగితేలుతున్న నా భార్య తలెత్తి, "స్వర్గస్థులైన మీ బాబాయ్‌గారి వేలువిడిచిన బావమరిది తమ్ముడి కొడుకట. పిల్లలు సాలార్జంగ్ మ్యూజియం, చార్మినార్, గోల్కొండ వగైరా చూడాలని మారాంచేస్తోంటే సతీసమేతంగా వేంచేశారట.

మీ రిక్కడుంటున్నట్టు చిత్తూరులో మాటవరసకు మీవాళ్ళు చెప్పారట. ఇంత దగ్గర బంధువులుండగా వేరే ఎక్కడో బసచెయ్యడం దేనికని పటాలంతో సహా దయచేశారు. పక్క గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. వెళ్ళి చూడండి." అంది.

ఆదరాబాదరా ఆ గదిలో కెళ్ళాను. ఇత్తడి చెంబులా తళతళ మెరిసే బట్టతలా, సోడాగ్లాసు కళ్ళజోడూ పెట్టుకున్న ఆ శాల్తీని ఈ జన్మలో కాదుకదా, వెనకటి ఏ జన్మలోనూ చూసిన దాఖలాలు కనిపించలేదు నాకు.

నన్ను చూడగానే, "ఇంకా నన్ను గుర్తుపట్టలేదుటోయ్ భజగోవిందం?" అంటూ గారపళ్ళికిలించి, "బాన్లే! మేము చిత్తూరు వదిలేటప్పుడు నువ్వు ఆరేళ్ళ బడుద్ధాయ్‌వి! ఓసారి నిన్ను ముద్దెట్టుకుందామని ఎత్తుకుంటే కావాలని నా సిల్కులాల్చీ తడిపేశావ్ గుర్తుందా?" అన్నాడు.

పిలవని పేరంటంగా పటాలంతో వచ్చింది చాలక, నన్ను బడుద్ధాయ్ అంటాడా? చెడ్డ చిరాకేసింది. ఇరవై ఏళ్ళ క్రితం నావల్ల పాడైన మీ సిల్కులాల్చీ చాకలిఖర్చు ఇరవైఏళ్ళ వడ్డీతో సహ వసూలు చేసుకుందామని ఇప్పుడీ పటాలంతో వచ్చారా స్వామీ!' అంటూ మొహంమీదే నాలుగు దులుపుదామనిపించింది. కానీ, మా వాళ్ళ మొహం చూసి అతి కష్టంమీద తమాయించుకున్నాను.

సుమారు పదిరోజులు పట్టింది నగరంలో వారి సౌహార్ద్రయాత్ర పూర్తికావడానికి. చరిత్రాత్మక కట్టడాలతో బాటు అదనంగా నాలుగు సినిమాలు చూసి మరీ పోయారు. పోయినవాళ్ళు ఊరుకోక, మామీద మరో ఉపకారంకూడా చేశారు. దగ్గరి బంధువులతోబాటు, దూరపు బంధువులకూడా మా ఇంటి చిరునామా ఇచ్చి నగరంలోని దాని ప్రాశస్త్యమూ, సౌకర్యాలూ వివరించారుట!

ఇంకేముంది! హైకోర్టు పనులున్న వాళ్ళూ, ఆస్పత్రుల చుట్టూ తిరిగే వాళ్ళూ ఉద్యోగాలకు ఇంటర్వ్యూల కొచ్చేవాళ్ళూ, మార్కెట్లో టోకున సరుకులు కొనేవాళ్ళ కూడా తిన్నగా మా ఇంట్లోనే బిఛాణా వెయ్యసాగారు. ఆ విధంగా ఆ ఇల్లు ఓ ఉచిత బోర్డింగ్ కమ్ లాడ్జింగ్ అయికూర్చుంది.

పరిస్థితి ఇలా శృతిమించి రాగాన పడేసరికి, ఓ రోజు నా గృహమంత్రిణి రాజీనామా ఇచ్చి పుట్టింటి కెళ్ళిపోతానని బెదిరించింది. అప్పటికే నేనూ బాగా విసుగెత్తిపోయాను. ధరలు ఆకాశాన్ని చీల్చుకుంటూ రోదసీ కుహరంలోకి దూసుకుపోతున్న ఈరోజుల్లో ఇంకొన్నాళ్ళిలాగే కొనసాగితే మా తిరుపతి యాత్ర దేవుడెరుగు. ఇక్కడే మా ఇద్దరికీ నున్నగా తిరుక్షవర మయ్యేట్టుంది!

సాధ్యమైనంత త్వరలో ఈ 'అద్దె లేని కొంప'ను వదిలేసి, ఏ మారుమూలో చిన్న అద్దెఇల్లు చూసుకుందామని నచ్చజెప్పాను మా ఆవిడకి. అప్పుడు గానీ ఆమె తన రాజీనామా ప్రస్తావన ఉపసంహరించుకోలేదు.

ఎట్టకేలకు నా భగీరథ ప్రయత్నం మీద సీతాఫల్‌మండిలోని ఆంజనేయస్వామి గుడిపక్క సందులో, రెండు ఫర్లాంగుల దూరాన మరో సందు తిరిగి, సరస్వతీ శిశుమందిరం ఎదురుగా మరో సందులో మూడు ఫర్లాంగులు పోతే కనిపించే అసంఖ్యాకమైన పెంకుటిళ్ళ మధ్య ఉన్న రెండుగదుల ఇల్లు దొరికింది నాకు!

(దయచేసి నా బంధుమిత్రు లెవరైనా ఈ వివరాలు చదివి, ఆ ఇల్లు వెతుక్కుంటూ రావడానికి ప్రయత్నించేరు! పగలంతా చెప్పులరిగేట్టు తిరిగినా ఆ ఇంటి జాడ దొరక్కపోతే ఆనక నన్ను తిట్టుకోవద్దు మరి!)

ఇల్లు దొరగ్గానే మా అన్నగారికీ, వదినగారికీ తక్షణం ఓ ఉత్తరంముక్క

రాసి పడేశాను. మేము వారి ఇల్లు ఖాళీ చెయ్యబోతున్నామని ఉత్తరం అందగానే హుటాహుటిన వచ్చారిద్దరూ.

"లక్షణంలాటి ఇల్లు అద్దె లేకుండా దొరికినప్పుడు నీ కిదేం బుద్ధిపుట్టింది బాబూ?" చిరుకోపంతో మందలించారు.

"లక్షణంలాటి ఈ ఇంట్లో మీ చెల్లాయి సలక్షణంగా ఉండలేనంటోం దండి, అందుకే ఆమె తిక్క కుదర్చ డానికి అనేక అవలక్షణాలున్న ఓ ఇల్లు చూశాను." అన్నాను, నొప్పింపక తా నొవ్వక అనే సూక్తి పాటిస్తూ.

"బాగా ఆలోచించుకోమ్మా! ఈ మహా నగరంలో ఇంత మంచి ఇల్లు, అదీ అద్దె లేకుండా దొరకడం మాటలు కాదు. ఇంకెవరికైనా అద్దెకిచ్చామంటే తరవాత చింతించి లాభం ఉండదు." అంటూ నచ్చజెప్పబోయారు అన్నగారు.

"తప్పకుండా ఇచ్చెయ్యండి బావ గారూ! మేము చింతించడం అటుంచి, మా శత్రువులక్కూడా ఇలాటి అద్దెలేని కొంప దొరకద్దని ఆ ఏడుకొండలవాడికి మొక్కుకుంటాం!" అంది మా ఆవిడ లోపలి అక్కసంతా వెళ్ళగక్కుతూ.

ఇహ అక్కడుండటం క్షేమం కాదని, ఆదరాబాదరా బైటికెళ్ళి, నాలుగు రిక్షాలు పిల్చుకొచ్చాను. అదివరకే కట్టి రెడీగా ఉంచిన సామానంతా వాటిలో కుక్కి, నా భార్యతో చివరి రిక్షా ఎక్కుతూ, ఓరగా ఇంట్లోకి చూశాను.

అంతకాలం తాళం వేసున్న వెచ్చాల గది తలుపు తెరుస్తూ కనిపించారు వదిన గారు! బహుశా, ఈసారి ఆమె ఆ గది తాళంచెవి తేవడం మర్చిపోలేదు కాబోలు!!

---

